క్లుప్తంగా

తుపానుకు దెబ్బతిన్న వరి



కదదరకుంటలో వరి పంటను పరిశీలిస్తున్న వీహెచ్‌ఏ సాజియా

కూడేరు: తుపాను ప్రభావంతో బుధవారం మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. కొర్రకోడు, తిమ్మాపురం, కూడేరుతో పాటు మరికొన్ని గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంట దెబ్బతింది. బాధిత రైతులు వెంటనే వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వీహెచ్‌ఏ సాజియా క్షేత్రస్థాయిలో పర్యటించారు. వరి పంటను పరిశీలించారు. కాగా.. తుపాను నేపథ్యంలో వరి కోతలు ప్రారంభించేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. కోతలు ప్రారంభించకపోతే వడ్లు రాలిపోయే అవకాశం ఉంది. ఏమి చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలు పాటించండి



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ యువరాజ్

కళ్యాణదుర్గం రూరల్: రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని సీఐ యువరాజ్ ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోలో పరిమితికి మించిన ప్రయాణికులు తరలించడం నేరమన్నారు. మద్యం తాగి, అతివేగంగా ఆటోలు నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆటోల రికార్డులను పరిశీలించారు.

రుద్రంపల్లి ఘటనపై మాజీ ఎంపీ విచారం

కుందుర్పి: రుద్రంపల్లిలో బుధవారం తెల్లవారుజామున మిద్దెకూలి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంపై మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య విచారం వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్ విజయ్ తదితర వైఎస్సార్‌సీపీ నాయకులతో విషయం తెలుసుకొన్న మాజీ ఎంపీ రంగయ్య మృతుల బంధువులతో ఫోన్లో మాట్లాడారు. మృతులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల పరిహారం, మృతుడు గంగన్న కుమారుడు ఈశ్వర్‌కు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసి ఉంటే మృతులు ముగ్గురు బతికి ఉండేవారన్నారు.

సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

కూడేరు: కూడేరు సర్పంచ్ మీనుగ లలితమ్మ బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆ సమయంలో భర్త చిన్నా స్నానం చేసి ఇంట్లోకి రాగా భార్య ఉరివేసుకుని ఉండడాన్ని గమనించాడు. వెంటనే ఆమెను కిందకు దించి.. చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రస్తుతం లలితమ్మ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

కళ్యాణదుర్గం రూరల్: ముద్దినాయనపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం లెప్రసీ, ఎయిడ్స్, టీబీ జిల్లా అధికారి డాక్టర్ అనుపమా జేమ్స్, డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి జస్వంత్, డీపీఓ నాగమణి, డీపీఎంఓ సత్యానారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీబీ రోగులకు మాత్రల స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. టీబీ పేషెంట్ల గృహాలను దర్శించి వారి యోగక్షేమాన్ని విచారించి వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. రోగ నిర్ధారణ జరిగినప్పటి నుంచి 6 నెలలు తప్పనిసరిగా మందులు తీసుకోవాలని రోగులకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ విజయేంద్ర, ఎంపీఈఓ వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

బొమ్మనహాళ్: మండల పరిధిలోని 14 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈనెల 6 నుంచి 23 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ షర్మిల బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న తగ్గుపర్తి, 7న ఎర్రగుడి, 9న రామసాగరం, 10న శ్రీరంగాపురం, 11న బెళుగుప్ప, 12న శీర్పి, 13న అంకంపల్లి, 16న నరసాపురం, 17న దుద్దేకుంట, 18న కాలువపల్లి, 19న ఆవులెన్న, 20న గంగవరం, 21న గుండ్లపల్లి, 23న కోనంపల్లి గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

వజ్రకరూరు: ఈనెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నయాజ్ అహమ్మద్ తెలిపారు. 6న రాగులపాడు, 10న పందికుంట, 12న పొట్టిపాడు, 13న గడేహోతూరు, 17న చిన్నహోతూరు, 18న తట్రకల్లు, 20న గంజికుంట, 21న పీసీ. ప్యాపిలి, 24న డమలకుంట, 26న జరుట్లరాంపురం, 28న వెంకటాంపల్లి, 31న వజ్రకరూరు, జనవరి 2న కమలపాడు, జనవరి 7న కొనకొండ్ల, జనవరి 8న చాబాల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు.

మృత్యు ఒడి



- పెరుగుతున్న మాతాశిశు మరణాలు
- పదిరోజుల్లోనే ముగ్గురు తల్లులు, ఇద్దరు శిశువులు మృతి
- హైరిస్క్ కేసులను గుర్తించి, సరైన చికిత్స అందించడంలో విఫలం

రాయదుర్గం: 'ఎక్కడా మాతా శిశు మరణాలు జరగకూడదు. బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోండి' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలు ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రతి సమావేశంలోనూ, కాన్ఫరెన్స్‌లోనూ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అయితే హైరిస్క్ కేసులను గుర్తించి, అందుకు సరైన చికిత్స అందించడంలో పూర్తిగా విఫలమవడంతో మాత్రం మాతా శిశు మరణాలు కొనసాగుతున్నాయి. పది రోజుల వ్యవధిలో ఒక్క రాయదుర్గం ప్రాంతంలోనే ముగ్గురు తల్లులు, ఇద్దరు శిశువులు మృత్యువాత పడ్డారు.

ఇవిగో మాతా శిశుమరణాలు



- రాయదుర్గం పట్టణంలోని కల్లీమఠం పాఠశాల సమీపాన నివాసం ఉండే మంజునాథ, సరళజ్యోతి దంపతులు కుట్టు కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. సరళజ్యోతి మూడోసారి గర్భం దాల్చింది. ఈమె రక్తహీనతతో బాధపడుతూ అనంతపురం ఆస్పత్రిలో చేరింది. ప్రసవానంతరం తల్లీబిడ్డ బిడ్డ ఇద్దరూ మృతి చెందారు. ఇందుకు వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని మృతురాలి భర్త ఆరోపిస్తున్నారు.



- రాయదుర్గంలోని వాల్మీకినగర్‌లో దేవరెడ్డి శ్రీగౌరి, గురురాజ్ దంపతులు నివాసముంటున్నారు. ఉపాధి నిమిత్తం టైలరింగ్ పని కోసం బెంగళూరుకు వెళ్లారు. శ్రీగౌరి గర్భం దాల్చడంతో సొంతూరికి తిరిగి వచ్చి స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. నవంబర్ 22న కాన్పు కోసం బళ్లారికి వెళ్లారు. బిడ్డతో పాటు కడుపులో గడ్డ పెరగడంతో 24 గంటల వ్యవధిలోనే శ్రీగౌరి మృతి చెందింది. ఎనిమిది నెలల పాటు చికిత్సలు అందించిన వైద్యులు హైరిస్క్ కేసు అని మాత్రం గుర్తించలేకపోయారు.

- రాయదుర్గం మండలం చదం గొల్లలదొడ్డికి చెందిన వడ్డే కొత్తూరు తిప్పమ్మ గర్భం దాల్చింది. మూడు నెలల నుంచే ఆహారం తినగానే విరేచనాలు అయ్యేవి. దీన్ని వైద్యులు, సిబ్బంది గుర్తించి కట్టడి చేయలేకపోయారు. ఇటీవల పురిటి నొప్పులు రావడంతో బళ్లారి విమ్స్‌కు కారులో తీసుకెళ్తుండగా మార్గం మధ్యలోనే తల్లీబిడ్డ మృతి చెందారు. ఇవే కాదు.. వెలుగులోకి రాని ఘటనలు చాలానే ఉన్నాయి.

మరణాలకు కారణాలివీ..

పౌష్టికాహార లోపం, రక్తహీనత, సకాలంలో వైద్యం అందకపోవడం లాంటివి గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు మృత్యుఒడి చేరడానికి కారణమవుతున్నాయి. గర్భం దాల్చగానే మాతాశిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ఆర్భాటాలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. పురిటినొప్పులతో బాదపడే తల్లులు బిడ్డకు జన్మనివ్వగానే మృతిచెందుతుండడం తీరని ఆవేదన మిగుల్చుతోంది. గతం కంటే మృతుల కేసులు తగ్గినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నా.. వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి.

పూర్తిగా తగ్గించేలా చర్యలు

మాతా శిశు మరణాలు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి నెలా సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ ఎక్కడ ఏ చిన్నపొరపాటుకూ తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. జిల్లాలో మాతాశిశు మరణాల రేటు బాగా తగ్గించాం. సరళాజ్యోతి అనే గర్భిణిని హైరిస్క్‌గా ముందే గుర్తించి అనంతపురం ఆస్పత్రిలో చేర్పించాం. అక్కడ జరిగిన పొరపాటుపై సమీక్షిస్తున్నాం. మిగిలిన ఇద్దరు బాలింతల మృతిపై సత్వరం విచారణ జరిపిస్తాం. నిర్లక్ష్యంతో కొందరు ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. గర్భం దాల్చింది మొదలు ప్రసవం వరకు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నాం.

– ఇ.బి.దేవి, డీఎంహెచ్‌ఓ, అనంతపురం

మాతాశిశు సంరక్షణకు చర్యలేవీ?

వైఎస్ జగన్ హయాంలో మాతాశిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి గర్భిణీ, బాలింతకు నాణ్యమైన పౌష్టికాహారం అందించారు. ఫ్యామిలి డాక్టర్ విధానం అమల్లోకి తీసుకొచ్చారు. తల్లి ఆరోగ్యం మొదలు బిడ్డ సంరక్షణ వరకు అన్ని సౌకర్యాలూ అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుత కూటమి సర్కార్ ఆ దిశగా కృషి చేయాల్సి ఉంది.

స్కూల్ స్థలంపై పచ్చ నేత కన్ను



ప్రైమరీ స్కూల్‌కు నిర్మించిన ప్రహరీ



స్కూల్ ఆవరణలో వాటర్ సంప్‌తోపాటు మరుగుదొడ్లు ఉన్న దృశ్యం

- ప్రహరీ కూల్చి తన పొలానికి దారి ఏర్పాటుకు స్కెచ్!

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ప్రభుత్వ పాఠశాల స్థలంపై అధికార టీడీపీ నేత కన్ను పడింది. తన పొలానికి దారి ఏర్పాటు చేసుకునేందుకు ఏకంగా పాఠశాల ప్రహరీని కూల్చేందుకు స్కెచ్ వేశాడు. అధికారులతో లోపాయికారి ఒప్పందం చేసుకుని పావులు కదుపుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆ నాయకుడి తీరుపై దుమ్మెత్తిపోస్తున్నారు. వివరాల్లోకెళితే.. కణేకల్లు మండలం తుంబిగనూరు ప్రాథమిక పాఠశాల స్థలం వెనుక టీడీపీ నాయకుడి పొలం ఉంది. ఈ పొలానికి గరుడచేడు మార్గం నుంచి దారి ఉంది. అయితే అంతదూరం వెళ్లడం ఎందుకనుకున్నాడో ఏమో.. నేరుగా పొలంలోకి మార్గం సుగమం చేసుకునేలా కసరత్తు మొదలుపెట్టాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి, పొలానికి మధ్య అడ్డుగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీని కూల్చేలా వ్యూహం రచించాడు. వాస్తవానికి ఈ స్థలం గ్రామకంఠంలో ఉంది. విద్యార్థుల ఆటపాటలకు అనువుగా ఉంటుందనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'నాడు–నేడు' కార్యక్రమం కింద ప్రహరీ ఏర్పాటు చేసి, తాగునీటి అవసరాల కోసం వాటర్‌సంప్ నిర్మించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన పొలంలోకి దారి వేసుకునేందుకు టీడీపీ నేత పథకం పన్నాడు. స్థలం తనదేనని, పొలానికెళ్లే దారిలో పాఠశాల ప్రహరీ అడ్డంగా కట్టారని, తనకు న్యాయం చేయాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు ఆగమేఘాలపై మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. ప్రహరీ కూల్చి పొలానికి దారి ఏర్పాటు చేసే ప్రక్రియకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. మరి అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

మోసం.. చంద్రబాబు నైజం

- హామీల అమలులో అట్టర్ ఫ్లాప్
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

బొమ్మనహాళ్: ఓట్ల కోసం హామీలు ఇవ్వడం.. గద్దెనెక్కాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. బుధవారం ఉద్దేహాళ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అనుబంధ యువత, రైతులు, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, విద్యార్థి విభాగం, పంచాయతీ రాజ్ విభాగం, వాణిజ్య విభాగాలకు త్వరలో నూతన కమిటీలు నియమించనున్నట్లు చెప్పారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అట్టర్‌ఫ్లాప్ అయ్యారని విమర్శించారు. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికీ రూ. 15 వేలు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇప్పటికీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ రూ.10 వేలు వేతనం ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఏకంగా ఆ వ్యవస్థకే మంగళం పాడటం శోచనీయమన్నారు. అన్నదాతా సుఖీభవ కింద ఏటా రూ. 20 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా వంచించారని మండిపడ్డారు. రైతులకు పూర్తి స్థాయిలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయలేదన్నారు. బీమా పేరుతో రైతులనుంచే ప్రీమియం కట్టించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు ఎంసీహెచ్ రాజ్‌కుమార్, లోకేష్, సూర్యప్రతాప్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, వన్నూరుస్వామి, కృష్ణ, తిప్పేస్వామి, ప్రభాకర్ గౌడ్, డాక్టర్ బసప్ప, రామకృష్ణ, వెంకటేశులు, ఆంజినేయులు, లక్ష్మీనారాయణ, నాగరాజు, శీన, రంగారెడ్డి, దేవన్న, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో శుభ్రత, నాణ్యత ఏదీ?



హోటల్‌లో తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్

రాయదుర్గంటౌన్: హోటళ్ల నిర్వాహకులు ఆహార పదార్థాల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, పరిశుభ్రత లోపించిందని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని హోటళ్లు, టిఫెన్ సెంటర్లను తనిఖీ చేశారు. శివసాయి హోటల్‌లో చట్నీని అధిక రోజులు నిల్వ ఉంచడాన్ని గమనించారు. పరిసరాల్లో అపరిశుభ్రత ఉంది. యజమానిని హెచ్చరిస్తూ రూ. వెయ్యి జరిమానా విధించారు. మరోసారి నిబంధనలు పాటించకపోతే హోటల్ సీజ్ చేస్తామని చెప్పారు. ఏ1 కబాబ్ సెంటర్‌ని తనిఖీ చేయగా నూనెను మార్చకుండా మళ్లీ మళ్లీ వినియోగిస్తుండడం గమనించి హెచ్చరించారు. రుచి రెస్టారెంట్‌ను తనిఖీ చేసి రూ.2 వేలు జరిమానా విధించారు. హోటళ్ల యజమానులు కచ్చితంగా నాణ్యత పాటించాలని, మాంసాన్ని, ఇతర ఆహార పదార్థాలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా శుభ్రత పాటించాలని, వినియోగదారులకు మినరల్ వాటర్ అందుబాటులో ఉంచాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ప్లాస్టిక్ క వర్లను వినియోగించరాదన్నారు.

తక్షణమే విధులు అప్పగించాలి

రాయదుర్గంటౌన్: రాజకీయ కక్ష సాధింపులో భాగంగా తొలగించిన మండలంలోని ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు తక్షణమే విధులు అప్పగించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. అక్రమంగా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడాన్ని ఖండించారు. కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నా ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోకపోవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు.

• ముగిసిన కుందుర్పమ్మ జాతర



అమ్మవారికి గంగపూజ నిర్వహిస్తున్న భక్తులు

బండమీదపల్లిలో రెండు రోజులుగా జరుగుతున్న కుందుర్పమ్మ జాతర బుధవారం గంగపూజతో ముగిసింది. గ్రామంలో ఐదేళ్లకోసారి కుందుర్పిమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తారు. గంగ పూజలో భాగంగా మధ్యాహ్నం భక్తులతో బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వెండి పల్లకీలో ఊరేగించారు. జాతరకు కుందుర్పి, తమ్మయ్యదొడ్డి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కుందుర్పి:

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం రూరల్: మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి, ఆర్డీఓ వసంత్‌బాబు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో కళ్యాణదుర్గం, బొమ్మనహాళ్, కణేకల్లు, బ్రహ్మసముద్రం మండలాల్లోని వివిధ శాఖల అధికారులకు పనిచేసే చోట లైంగిక వేధింపుల నివారణ నిషేధం దిద్దుబాటు చట్టంపై ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ పీడీ, ఆర్డీఓ, సీడీపీఓ ప్రసన్నభారతి, మాట్లాడుతూ పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు గురవుతున్న మహిళల రక్షణ కోసం సెక్సువల్ హెరాస్మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్‌వర్క్ ప్లేస్ ప్రివెన్షన్ ప్రొహిబిషన్ యాక్ట్– 2013 ఏర్పాటు చేశారన్నారు. చట్టం పూర్వాపరాలు, నిర్వచనం,అంతర్గత, స్థానిక ఫిర్యాదుల కమిటీల ఏర్పాటు, ఫిర్యాదులు విచారణ, రిపోర్టు తదితర అంశాలపై అధికారులకు అవగాహన కలిగించారు. సోషల్ కౌన్సిలర్ ఉమాదేవి కేస్ స్టడీను తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఏపీఎంలు, మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రోశయ్య సేవలు ఎనలేనివి



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

రాయదుర్గంటౌన్: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రోశయ్య మూడో వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక కోటలోని వ్యాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోశయ్య రాష్ట్రానికి అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జయంతి సురేష్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఈశ్వరీదేవి రథోత్సవం



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: కమలపాడులో బుధవారం ఈశ్వరీ దేవి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం శ్రీశాంతనంద ఆశ్రమంలో సుప్రభాతసేవ అనంతరం ఈశ్వరీ దేవి, సద్గురు శాంతనంద (రంగయ్య) విగ్రహాలకు ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాభిషేకాలు చేపట్టారు. 101 కలశాలతో మేళతాళాలు, భజనలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు గురుసేవానందస్వామి, సర్పంచ్ తిరకమ్మ, రుత్వికులు చంద్రమౌళీస్వామి పాల్గొన్నారు.

అపార్ నమోదు వేగవంతం చేయాలి



అపార్ నమోదును పరిశీలిస్తున్న ఎంఈఓ

వజ్రకరూరు: అపార్ నమోదు వేగవంతం చేయాలని ఎంఈఓ తిమ్మప్ప ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం పందికుంట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. అపార్ వివరాల నమోదుపై ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, ఇప్పటి వరకూ ఎంతమంది విద్యార్థుల వివరాలను నమోదు చేశారు? వివరాలు నమోదు చేయని విద్యార్థులు ఎంత మంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. వివరాల నమోదులో సందేహాలు వస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి, ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కంబదూరు: ములకనూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గంగాధర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య బుధవారం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, నాయకులు గోవిందు, నారాయణపురం వెంకటేశులు, ఎంఎస్ రాయుడు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో ఈనెల 6 నుంచి జనవరి 8 వరకు జరిగే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ వసంతబాబు ప్రజలకు సూచించారు. ఈమేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వీఆర్‌ఓ, సర్వేయర్, అటవీ తదితర శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. భూ సమస్యలున్న వారు సదస్సుల్లో అధికారుల దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

పీఆర్ ఇంజినీర్‌కు గాయాలు

వజ్రకరూరు: మండల పంచాయతీరాజ్ ఇంజినీర్ (పీఆర్) మణిభూషణ్‌కు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. వివరాలు.. విధి నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం గుంతకల్లు నుంచి వజ్రకరూరుకు పీఆర్ ఇంజినీర్ మణిభూషణ్ ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. గుంతకల్లు సమీపంలోని ఆర్టీసీ డిపో వద్దకు చేరుకోగానే.. కుక్క అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో మణిభూషణ్ కింద పడటంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం గుంతకల్లులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

సుబ్రహ్మణ్యేశ్వర షష్టి ప్రారంభం

ఉరవకొండ: పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం షష్టి, కల్యాణోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. స్వామికి ప్రార్థన, సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, కలశ ప్రతిష్ట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మూలవిరాట్‌కు 11 కేజీల తేనేతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు దివాకర్‌శర్మ, నాగరాజుశర్మ, ఆలయ ఈఓ అంగడాల కృష్ణయ్యల అధ్వర్యంలో ధ్వజారోహణం, గణపతి, నవగ్రహ హోమాలు నిర్వహించారు.

'సాగునీటి' ఎన్నికలు పకడ్బందీగా చేపట్టాలి

బొమ్మనహాళ్: సాగునీటి సంఘం ఎన్నికలు పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ మునివేలు అధికారులకు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పీఓ, ఏపీఓలకు శిక్షణ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సాగు నీటి సంఘాల ఎన్నికలను ఏకగ్రీవం చేసేందుకు పీఓలు, ఏపీఓలు కృషి చేయాలని తెలిపారు. ఏకగ్రీవం వల్ల ఆ సాగునీటి సంఘాలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధులు వస్తాయని, ఆ నిధులతో అభివృద్ధి పనులు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ జేఈ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రాయదుర్గం: రాతిబావివంకలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని బుధవారం అరెస్ట్ చేసినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. వారి నుంచి రూ.7వేల నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఫసల్ బీమా ప్రీమియం చెల్లించండి

కణేకల్లు: రబీలో పప్పుశనగ సాగు చేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కోసం ప్రీమియం చెల్లించాలని వ్యవసాయశాఖ అధికారి ఎ.శ్రవణ్‌కుమార్ కోరారు. మండలంలోని సొల్లాపురం, ఎన్.హనుమాపురంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులనుద్దేశించి ఏఓ మాట్లాడారు.

కళ్యాణదుర్గం రూరల్: ఈస్ట్‌కోడిపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జేడీఏ ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డీడీ సజ్జన్ మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేసే రైతులు ఈనెల 15లోపు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

రాయదుర్గం డివిజన్
9912220732, 9010470185, 9010223701